# ★ మళ్లీ మెలత బయల్దేరింది....

★ కొత్త వెంకటగోవిందరావు ★

అతని జీవితం ఒక సముద్రం. చేసే వుద్యోగం అందులోని ఒక సుడిగుండం. ఇదే గోపాలాన్ని అనేక సందిగ్ధ సమయాల్లో వూపిచూసింది. అంతకాలం జరిగాక గోపాలం రేషనింగు షాపులో బియ్యం కొలిచేందుకు కుదిరాడని నా తోటివాండ్లకు కొందరికైనా తెలుసు, అదే అతనిలో అంత మార్పు తేవటానికీ విచిత్రమైన సంఘటనలను ఎదుర్కోవడానికీ కారణమైంది. కానీ గోపాలాన్ని వెన్నంటిన సమస్య అంత సులభంగా విరగడైపోయేప్పటికి మనస్సుకు శాంతి చిక్కింది.

గోపాలానికి బియ్యంకొలత వుద్యోగంలో చేరాక, తన వియమిత జీవితంలో యిహ సాధించవలసిందేమీ లేనట్లు తోచింది. నవ్వుతూ యిల్లు కదిలి, పరిహాసాలతో రేషన్‌షాపు వదిలేవాడు.

ఒకప్పటి గోపాలాన్ని అందరూ ఎరుగుదురు. వింతగా చూస్తూ, కడుపునిండని బాధతో లొట్టలు వేస్తూ వీధులవెంట తిరిగాడు. కడుపు కాలి.... ఆకలిమంటల్లో ప్రపంచాన్ని దోచడానికి నాయకత్వం వహిస్తానన్నాడు. అంతస్థులు లేపిన ధనికులంతా, పగలు దోచేదొంగలు కడుపుకక్కుర్తి కోసం చేస్తున్న విషయం గ్రహించలేరని అతని ఆశయం, అలాంటి—గోపాలం........

అతనికి ఆ రోజుల్లో దిగులులేదు. అతని పని తనకు యిచ్చిన బస్తాలు రాసులుగా దొర్లించి చీట్లప్రకారం బియ్యంకొలవడం, పగటి గారడీలా గోపాలం కొలతలో మానిక గింజలమీద, మరో మానెడు నిలిచినట్లుండేవి. కాని అంతా పూర్తయాక లెఖ్ఖ వప్పగించడం, పెచ్చుధాన్యం ప్రక్కజేబులోని గుడ్డ సంచిలోకి నింపడం గోపాలం చివరిపని, ఈ కనికట్టు యజమానికీ, మరే జంటకళ్ళకూ తెలియదు.

అతని ప్రతిభ సాగింది. నెల తిరిగేప్పటికి వేల బస్తాలు దొర్లుతున్నాయి. గోపాలం చేతిసంచి వెడల్పై, ముడుచుకుంటువుంది.

అనుమానంతోనో, ఆశతోనో రేషన్‌కొలత తిరుగ కొలిచిన ఘటికులున్నారు. చాలమంది ఆ సమస్య సాగతీసి ఆలోచించి అర్థంచేసుకున్నారు. కొట్లో కొలిచిన మానెడు గింజల్లో, యింటికి వచ్చేప్పటికి గిద్దెడు షుమారు గాలి తినేస్తున్నాదేమోనని ?

తెలిసినవాళ్ళెవరూ అడుగలేదు. రేషన్‌బియ్యంలోనూ కృత్యపద్ధతి, ధైర్యాన్ని చిక్కబట్టి నిజం బయటికి నెట్టితే—గోపాలం కోపానికి ఆహుతై వేళ తప్పి వస్తులు కాయాల్సివస్తుంది.

★

ఆ విషయం, తర్వాత మరోవిషయం అందరికీ తెలిసింది. గోపాలానికి ఎక్కువైన బియ్యం బ్లాకులో అమ్ముతున్నాట్ట,

ఒకరోజు పడమటిబజారు కూలీ వచ్చి, "ఈ విషయం విన్నారా?"....అన్నాడు గోపాలం యజమానితో.

"అదేమిటి?" అన్నాడు అతను విస్మయపడి, అంత గమ్మత్తుగా వచ్చిన మనిషిని చూసి.

ఆ కూలీ మీసం దువ్వుకొని పెద్దగా నవ్వాడు. "మీ గోపాలం చూశారా ఎంతపని చేస్తున్నాడో? దొంగకొలతలో మిగిలిన బియ్యం కొంప జరుపుకుంటూ బ్లాకు చేస్తున్నాడు!"

"నిజంగానో" అన్నాడు షావుకారు యదార్థంగా కొంచెం చకితుడై.

కూలీ పోతూ పోతూ వింతగా చూశాడు. "దినగండంతో బ్రతికేవాడికి పరాచకాలుంటాయా బాబూ?"

యజమాని సాయంత్రం గోపాలాన్ని పిల్చి సంగతిచెప్పి "నిజంగా?" అన్నాడు.

"నిజంగానే!" అని చెప్పాడు గోపాలం ఆలోచించకుండా. చేసిన పనికన్నా, అనుకోని రకంగా వచ్చిన సమాధానం చూసి విస్తుపోయాడు షావుకారు.

* ఆనందవాణి




"ఐతే దొంగకొలతేనా? నన్నుకూడా మోసం చేస్తున్నావా?"

"కొలత దొంగకొలతే, కానీ...."

"కానీ...." గట్టిగా అడిగాడు షావుకారు.

"నేను అన్యాయంగా కొలిచేది—బీదలమీద మేడలుకట్టినవాళ్ళకు కొలిచేప్పుడుమాత్రమే!"

"అంతా విని వూపిరి బిగపట్టి" యదార్థంగానా?" అన్నాడు షావుకారు ఆలోచించి, "అట్లా ఐతే ధనికులంటే నీ కళ్ళకు చీడపురుగులన్న మాట!"

"అవును యదార్థం........కాదు కాదు...." గోపాలం నాలిక్కొరుక్కున్నాడు.

యజమాని చుట్టపీక చివరిమారు గట్టిగా పీల్చి పారేసి, "రేపు వుదయం వచ్చి రావల్సినమటుకు డబ్బుపట్టుకెళ్ళు!" అన్నాడు.

గోపాలం ఆవేళ పనికాకముందే రోడ్డుమీదపడి వెళ్ళాడు. రెండుసార్లు తిరిగిచూశాడు....షావుకారు కోరగా, కోపంగా చూస్తున్నాడు. మళ్లీ గోపాలం జీవితంలో మెలత బయలుదేరింది!!

—— ——

# వేమన పద్యాలు

★

లంజతనువునమ్మ లంచగొండమ్మును
ప్రజల మానధనము ప్రాణచయము
యెంచిచూడ రిద్యులెవ్వరిద్వరిలోన
విశ్వదాభిరామ వినురవేమ.

పల్లెపల్లెయంచు పలవింత్రు పెద్దలు
పల్లెపోయి చూడు ప్రజల వరుస
బలమొ, ధనమొలేక బ్రతుకుట గండంబు
విశ్వదాభిరామ వినురవేమ.

రక్షకభటశాఖ రధికుల రాకకై
యెదురుచూచు బస్సు నెక్కరాదు
ప్రజలపనులవిలువ ప్రభులు గుర్తింపరు
విశ్వదాభిరామ వినురవేమ.

పొలము పుత్ర పాడి పొలతియు గల్గిన
గ్రామవాసి పట్నగామియయ్యె
బ్రతుకుతెరవునెరిగి బడిపంతులౌటగా
విశ్వదాభిరామ వినురవేమ.

—'కాళీపట్నం'